క్లుప్తంగా

భారీ అన్నసమారాధన

అంబాజీపేట: స్థానిక శ్రీనివాస్ నగర్‌లో వేంచేసిన విజయబేతాళ స్వామి ఆలయం వద్ద స్థానిక కమిటీ సభ్యులు ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవంలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు ఆరు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని భక్తులు, స్థానికులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, 13 పాలాల యువకులు, పెద్దల సహకారంతో ఘనంగా నిర్వహించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట, మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ సభ్యులు, 13 పాలాల పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి పి.గౌరీదేవి అన్నారు. మొసలపల్లిలో ఆదివారం పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామాన్ని ఆదర్శవంతంగా ఉండేలా ప్రజలు సహకరించాలన్నారు.

108 వాహనంలో ప్రసవం



రావులపాలెం 108లో జన్మించిన శిశువుతో సిబ్బంది

రావులపాలెం/కొత్తపేట: స్థానిక 108 వాహనంలో ఆదివారం ఒక గర్భిణికి ప్రసవం జరిగినట్టు సిబ్బంది తెలిపారు. కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన మహిళ కడలి కృష్ణకుమారికి ప్రసవం నొప్పులు అధికమవడంతో 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. రావులపాలెం 108 సిబ్బంది ఆమెను హాస్పిటల్‌కు తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమవడంతో అంబులెన్స్ టెక్నీషియన్ జి.నాగరాజు డెలివరీ కండక్ట్ చేయగా శిశువు ఎదురుకాళ్లతో పేగు మెడకు చుట్టుకుని జన్మించింది. ఎదురుకాళ్ళతో పుట్టడం వల్ల శిశువు ఆరోగ్య స్థితి విషమించడంతో టెక్నీషియన్ ఎంతో సమయస్ఫూర్తితో శిశువుకు అత్యవసర వైద్యం అందించడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిందన్నారు. తల్లిని, శిశువును తదుపరి వైద్య సహాయం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ వారిద్దరికి వైద్యం అందించారు. అనంతరం శిశువుకు అదనపు చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ పిల్లల ఆస్పత్రికి తరలించారు. టెక్నీషియన్ నాగరాజు, పైలట్ కుంచే ప్రదీప్‌కు గర్భిణి కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు.

భారతీ మహాస్వామి విజయ యాత్ర ఏర్పాట్ల పరిశీలన

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంకలో త్వరలో జగద్గురు శంకరాచార్య వారి ఆశీస్సులతో విదుశేఖర భారతీ మహాస్వామి విజయ యాత్ర పురస్కరించుకుని చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. ఈ మేరకు పండితులతో ఆయన చర్చించారు. వారి వద్ద నుంచి ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్నారు. వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

వామ్మో... దోమలు



అంబాజీపేటలో నివాస ప్రాంతాల మధ్య పేరుకుపోయిన చెత్త

అంబాజీపేట: సాయంత్రం నాలుగు గంటలు దాటితే చాలు ప్రజలపై దోమలు తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. అంబాజీపేట, అయినవిల్లి, పి.గన్నవరం, మామిడికుదురు మండలాల్లో అన్ని గ్రామాల్లోనూ దోమల వల్ల ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. సాధారణంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండి, భూమి తడిబారి ఎక్కువ రోజులు తేమ కారణంగా ఎక్కడికక్కడ దోమలు ఉత్పత్తి చెందేవి. గత కొన్ని రోజులుగా అన్ని ప్రాంతాల్లో దోమలు సమస్య ఎక్కువైపోయిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడు వాపు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. పలు ప్రాంతాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా మురుగు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. కాగా గ్రామ పంచాయతీల ద్వారా డ్రెయిన్లు, స్లమ్ ఏరియాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయకపోవడం కూడా వీటి వృద్ధికి కారణమని పలువురు చెబుతున్నారు. దీనికి తోడు గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించడం కూడా దోమలు ప్రబలడానికి మరో కారణంగా కనిపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుదేలైన నిర్మాణ రంగం

- లభ్యం కాని ఇసుక
- ఉపాధి లేక అల్లాడుతున్న కూలీలు
- ఆందోళనలో కార్మికులు

మామిడికుదురు: ఉచిత ఇసుక ఇస్తామని ప్రభుత్వం ఎంత గొప్పగా ప్రకటనలు చేస్తున్నా అది ఆచరణ సాధ్యం కాక నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైంది. దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి లబోదిబో మంటున్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు, సిమెంట్ షాపుల యజమానులు, వాటిలో పని చేసే కార్మికులు, కూలీలతో పాటు ఇతర రంగాలకు చెందిన కార్మికులు ఉపాధి లేక ఖాళీగా కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడింది. తాపీ కార్మికులు, కూలీలు, ఇటుక బట్టీల్లో పని చేసే కార్మికులు, ట్రాక్టర్లపై పని చేసే కూలీలు ఈ విధంగా ఎన్నో రంగాలపై ఇసుక తీవ్రమైన ప్రభావం చూపింది. ఎన్నికల కోడ్ ప్రకటించిన నాటి నుంచి ఇదే పరిస్థితి ఉందని పలు రంగాలకు చెందిన కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బ్రాందీ షాపులపై పెట్టిన శ్రద్ధ అత్యవసరమైన ఇసుక సరఫరాపై ఎందుకు పెట్టడం లేదో! అర్థం కావడం లేదన్న తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

20 వేల మందిపై ప్రభావం...

ఇసుక సరఫరా సమస్య మామిడికుదురు మండలంలో సుమారు 20 వేల మందిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపిందని చెబుతున్నారు. మండలంలో 100 వరకు ట్రాక్టర్లు ఉన్నాయి. నిర్మాణ రంగానికి సంబంధించిన వివిధ పనులను ఈ ట్రాక్టర్ల ద్వారా నిర్వహిస్తున్నారు. ఇసుక తరలింపు, ఇటుకల తరలింపు, సిమెంట్ ట్రాన్స్‌పోర్ట్ తదితర పనులకు వీటిని వినియోగించేవారు. కానీ ఏడు నెలల నుంచి ట్రాక్టర్లు ఖాళీగా ఉంటున్నాయని యజమానులు వాపోతున్నారు. మండలంలో 30కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ఈ బట్టీల్లో ఇటుక తీయడం, ఇటుక ఎగుమతి, దిగుమతి వంటి పనులకు సుమారు 600 మంది పని చేసే వారు ప్రస్తుతం వారంతా



అప్పనపల్లిలో అమ్మకాలు లేక డీలా పడ్డ ఇటుక బట్టీలు

ఖాళీ. మండల పరిధిలో వెయ్యి మంది తాపీ మేస్త్రీలు ఖాళీగా ఉంటున్నారు. వారు పని చేస్తేనే కూలీలకు పని దొరికేది. కూలీలు కూడా పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి. దీనిపై ప్రభుత్వం ఇప్పటికైనా సముచిత నిర్ణయం తీసుకుని కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఇసుక సరఫరా చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాక్టర్లు ఖాళీగా ఉంటున్నాయి



ఇసుక ప్రభావం చాలా రంగాలపై పడింది. ఇసుక అందుబాటులో లేక పోవడంతో కిరాయిలు లేక ట్రాక్టర్లు చాలా కాలం నుంచి ఖాళీగా ఉంటున్నాయి. ట్రాక్టర్లపై పని చేసే ఎంతో మంది కూలీలు ఉపాధి లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యజమానులుగా మేము సైతం అవస్థలు పడాల్సి వస్తోంది. ఇలా ఇంకా ఎంత కాలం ఉండాల్లో తెలియడం లేదు. ఇసుక సమస్య కార్మికుల పాలిట శాపంగా మారింది. ఇసుకను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి.

– శిరిగినీడి శ్రీరాములు, ట్రాక్టర్ యజమాని, పెదపట్నంలంక

రెండు నెలల నుంచి పనులు లేవు



ఇసుక లభ్యం కాక రెండు నెలల నుంచి ఖాళీగా ఉంటున్నాం. మామిడికుదురు మండలంలో తాపీ మేస్త్రీలు, కార్మికులు కలిపి సుమారు 600 మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. మేమంతా ప్రస్తుతం ఉపాధి కోల్పోయాం. వేరే పని చేసే అలవాటు మాకు లేదు. ఏ పనీ లేక ఖాళీగా ఉంటున్నాం. ఈ పరిస్థితి ఇంకా ఎన్ని రోజులు ఉంటుందో అర్థం కావడం లేదు. అధికారులు, ప్రభుత్వం ఇసుక అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలి.

– రుద్రా శ్రీనివాస్, తాపీమేస్త్రి, మామిడికుదురు

అప్పల పాలయ్యాం



నిర్మాణ రంగానికి ఇసుక ప్రధాన సమస్యగా మారింది. ఏడు నెలల నుంచి నిర్మాణం రంగం కుంటుపడింది. దీంతో ఎంతో మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మండలంలో సుమారు 30 ఇటుక బట్టీలు ఉన్నాయి. లక్షల్లో ఇటుక నిల్వలు పేరుకు పోయాయి. నిర్మాణాలు నిలిచి పోవడంతో ఇటుకలు అమ్ముడు కావడం లేదు. వడ్డీలకు పెట్టుబడులు తెచ్చి ఇటుకలు తీశాం. అమ్మకాలు లేక వడ్డీలు పెరిగిపోయి అప్పుల పాలయ్యాం. ప్రభుత్వం ఇసుక సరఫరాపై తక్షణం చర్యలు తీసుకోవాలి.

– పేరూరు వెంకటేశ్వరరావు, ఇటుక బట్టీ యజమాని, బి.దొడ్డవరం

అనారోగ్య బాధితుడికి చెక్కు అందజేత



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.10 వేల చెక్కు అందజేశారు. మండలంలోని వెదిరేశ్వరం గ్రామ శివారు గుత్తుల వారిపాలేనికి చెందిన మట్టపర్తి మాణిక్య త్రినాథ్ (17) కిడ్నీ సంబంధిత వ్యాధితో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. తలసేమియా వ్యాధి కారణంగా ప్రతి నెలా రక్తం మార్చాల్సిన పరిస్థితి. ఇప్పటికే చాలా డబ్బు ఖర్చు పెట్టారు. ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో మాణిక్య త్రినాథ్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.10 వేల చెక్కు అందజేశారు.

శ్రీకృష్ణమందిర్‌లో విశేష పూజలు

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో ఆదివారం మందిర నిర్వాహకుడు శ్రీ సుందర శ్రీనివాసదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. గీతా శ్రీకృష్ణుని తత్వం బోధిస్తుందన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రభూపతిదాసు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కొబ్బరితోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు రైతులకు సూచిస్తున్నారు. అక్టోబర్ చివర వారం, నవంబర్ నెలలో కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు ఇప్పటికే రైతులకు వివరించారు. వర్షాకాలం చివరిలో కొబ్బరి రైతులు దుక్కిలు బాగా చేసుకోవాలన్నారు. హరిత ఎరువులైనటువంటి జనుము, పిల్లిపెసర, నత్రజని స్థాపన మొక్కల విత్తనాలను తోటల్లో చల్లుకోవాలన్నారు. కొబ్బరి కాయలను ప్రతి నెల క్రమం తప్పకుండా సరైన సమయంలో దింపు తీసుకోవాలన్నారు. వర్షానికి ముంపునకు గురైన తోటల్లో నీటిని బయటకు పంపాలన్నారు. వర్షాధారంపై ఉన్న కొబ్బరి తోటలలో రెండో దఫా ఎరువులను కొబ్బరి చెట్టు చుట్టూ 2 మీ దూరం, 25 సెం.మీ లోతు పళ్లాలు చేసుకోవాలన్నారు. సిఫారసు చేసిన ఎరువులను వినియోగించాలన్నారు. పచ్చిరొట్టను కోసి కొబ్బరి చెట్టు పళ్లెంలో వేసుకోవాలన్నారు. ప్రతి రైతు వీటిని ఆచరించడం వల్ల కొబ్బరితోటలకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొబ్బరి చెట్లకు తెల్లదోమ ఆశిస్తుంది. దీనిని రైతులు తొలి దశలోనే గమనించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి లేని పక్షంలో డిసెంబర్ నెలాఖరు నాటికి తెల్లదోమ ఉధృతి అధికంగా ఉండి కొబ్బరి పంటను నాశనం చేస్తుంది. తెల్లదోమ కనిపించిన కొబ్బరి తోటల్లో పిచికారీ చేయాలని అందుకు సంబంధించిన పురుగులు స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



అంబాజీపేటలో కొబ్బరి తోటలో దుక్కుదున్న రైతు

మొక్కుబడిగా పొలం పిలుస్తోంది

- ఫ్లెక్సీలతో ప్రచారమే..
- హాజరు కాని అనుబంధ శాఖల అధికారులు
- వ్యవసాయాధికారులతోనే మమ

కొత్తపేట: రైతుల పక్షపాతిగా చెప్పుకుంటూ కూటమి ప్రభుత్వం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తోంది. ఫ్లెక్సీలతో ప్రచారమే తప్ప క్షేత్ర స్థాయిలో రైతులకు ప్రయోజనం మాత్రం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. కార్యక్రమానికి వ్యవసాయాధికారులు మినహా అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజర్ అవుతుండటంతో కార్యక్రమం అబాసుపాలవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంటల సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో వారానికి ఒక రోజు గ్రామ స్థాయిలో ‘పొలం బడి’ కార్యక్రమం, ప్రతి నెలా విధిగా మండల స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించేవారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు పాల్గొనేవారు. ఆయా శాఖల సమస్యలపై సమీక్షించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేవారు. రైతు ప్రయోజనాలను కాపాడేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మండల స్థాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా మంగళ, బుధ వారాలు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ఉదయం, సాయంత్రం వ్యవసాయాధికారులతో పాటు వాటి అనుబంధ శాఖల అధికారులు సైతం పొలంబాట పట్టి రైతులకు అవగాహన కల్పించాలి. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకొని నూతన పద్ధతులపై అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. పలు మండలాల్లో వరి పంటతో పాటు అనుబంధ ఉద్యాన శాఖ, పాడి సంపద, గోదావరి తీరప్రాంత మత్స్యకార రైతులు ఉన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయాధికారులతో పాటు ఉద్యాన, ఆత్మ, సెరీకల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం వంటి పదికి పైగా శాఖలకు సంబంధించి అధికారులు హాజరుకావాలి. కానీ వ్యవసాయ అధికారులతో పాటు ఎక్కడో ఒకచోట ఒక్కో శాఖాధికారి హాజరై మమ అనిపిస్తున్నారు. ఒక్కోసారి క్షేత్రస్థాయికి కూడా వెళ్లకుండా ఒక గ్రామ సచివాలయం వద్ద కొందరు రైతులను సమీకరించి మమ అనిపించి ముగిస్తున్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన రైతు భరోసా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి రైతు సంక్షేమ పథకాల జాడేదని పలుచోట్ల రైతులు వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తుంటే వారు జవాబు ఏమి చెప్పాలో తెలియక మౌనం వహిస్తున్నారు. ఇలా పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.



కొత్తపేట సచివాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఫ్లెక్సీల ప్రదర్శన (ఫైల్)

ప్రచారమే.. ప్రయోజనం శూన్యం



వ్యవసాయ అనుబంధ శాఖాధికారులతో నిర్వహించాల్సిన పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ఉద్యానవన, పశు సంవర్ధక, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు కార్యక్రమానికి హాజరై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం ఎక్కడా ఆ స్థాయి కార్యక్రమాలు లేవు. వ్యవసాయ సిబ్బంది ఇద్దరు, ముగ్గురు రైతులను పంట పొలాల్లోకి తీసుకువెళ్లి వెళ్లి ఫొటోలు తీసుకుంటూ కార్యక్రమాన్ని ముగించేస్తున్నారు. దీనివల్ల ప్రయోజనం శూన్యం.

– పెదపూడి త్రిమూర్తి శ్రీనివాస్, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, కొత్తపేట

అధికారులకు ఘన సత్కారం



ఆలమూరులో బదిలీపై వెళ్లిన అధికారులను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

ఆలమూరు: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారులకు ఘన సత్కారం జరిగింది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ ఎ.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిపోయిన ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కె.నంజీవరెడ్డి, పాలింగి రాజు, యు.రేణుక, శ్యామ్‌సుందర్, కె.సుప్రియ, ఆర్‌వీవీఎస్ సత్యనారాయణకు పూలమాల, దుశ్శాలువా వేసి ఘనంగా సత్కరించారు. ఏళ్ల తరబడి ఆయా గ్రామాల ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. కార్యదర్శులు ఎంవీ జయారెడ్డి, వి.వేణి, ఎస్.వీర్రాజు, సీహెచ్ వీరమాత, జె.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలని ధర్నా

అమలాపురం రూరల్: కొత్తపేట మండలం అవిడి రేవు వద్ద ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం కలెక్టరేట్ ఎదుట మహిళలు ధర్నా చేపట్టారు. అవిడి రేవులోని లేఅవుట్‌లో మూడు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటామని చెప్పి, తమ ఇళ్ల వద్ద బ్రాందీ షాపు పెట్టి దారులు మూసివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రాత్రుళ్లు తమ ఇళ్ల సర్వీస్ వైర్లు కట్ చేసి విద్యుత్ నిలిపివేస్తున్నారని అన్నారు. కొత్త ఇళ్లు నిర్మించుకుంటే వారి అనుచరులతో అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. అక్కడి నుంచి వెళ్లగొట్టాలని తమపై కక్ష కట్టి హరిప్రియ అనే గృహిణిపై వెంకట సూర్యనారాయణ, ధనప్రసాద్‌లు దాడి చేశారన్నారు. బ్రాందీ షాపు తొలగిస్తామని అధికారులు హామీలు ఇస్తున్నా, ఇంతవరకూ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. కొత్త మద్యం పాలసీలో భాగంగా ఈ నెల 16న షాపును ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు టి.నాగవరలక్ష్మి, కుసుమ హరిప్రియ, జిల్లేళ్ల హేమలత, బొక్కా శాంతకుమారి, కుసుమ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపు తొలగించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

చెకుముకి టాలెంట్ టెస్ట్



జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన టీం సభ్యులతో ప్రముఖులు

మలికిపురం: స్థానిక డిగ్రీ కాలేజీలో వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక కోనసీమ జిల్లా నేతృత్వంలో జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక జేవీవీ ఉపాధ్యక్షుడు ఎస్.రమేష్ బాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, కాలేజీ కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ మూర్తి, ఎంఈవోలు విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మొహిద్దీన్ పాల్గొన్నారు. టాలెంట్ టెస్టులో సుమారు 50 టీంలు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ నుంచి రాశాయి. ఈ పరీక్షల్లో ప్రభుత్వ సెక్టార్ నుంచి వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల టీం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రైవేటు సెక్టార్‌లో కొత్తపేట భాష్యం స్కూల్ టీం జిల్లా ప్రథమ స్థాయిలో నిలిచింది. ఈ రెండు టీంలు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించి, త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనున్నాయి. వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్, జిల్లా కల్చరల్ కన్వీనర్ సీహెచ్ తులసీరావు, కాలేజీ ప్రిన్సిపాల్ టీవీవీ సత్యనారాయణ, యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జనరల్ సెక్రటరీ ఎస్.విశ్వనాథం, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బి.ఝాన్సీబాయి, ప్రముఖులు బి.శ్రీనివాసరావు, సీహెచ్ మల్లేశ్వరరావు, బోణం రాజు పాల్గొన్నారు.

స్ట్రెయిట్ కట్ తవ్వకం పనుల పరిశీలన



మెండుపాలెం వద్ద సముద్రంలోకి తవ్వుతున్న స్ట్రెయిట్ కట్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు సముద్రంలోకి ఉన్న స్ట్రెయిట్ కట్ తవ్వకం పనులను ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. తీరప్రాంత గ్రామాల్లోని ముంపు నీరు డ్రెయిన్ ద్వారా సముద్రంలోకి పోవడానికి స్ట్రెయిట్ కట్ తవ్వకం పనులు దోహదపడతాయని ఆయన తెలిపారు. సర్పంచ్ మేడిద సరోజ, ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జి.పెదకాపు, ముప్పర్తి నాని, యెనుముల సుబ్బారావు, ఉండపల్లి అంజి, గెడ్డం మహలక్ష్మి ప్రసాద్, డ్రెయిన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు మండల అధికారుల ఫోన్ నంబర్లు

హోదా	పేరు	ఫోన్ నంబర్
తహసీల్దార్	కెజె.ప్రకాష్‌బాబు	98499 03902
రావులపాలెం సీఐ	సీహెచ్.విద్యాసాగర్	94407 96537
సబ్ ఇన్‌స్పెక్టర్	ఎం.అశోక్	9440904849
ఎంపీడీఓ	కె.జాన్‌లింకన్	94938 17051
ఈఓపీఆర్డీ	ఏ రాజు	83175 42815
ఏడీఏ	కె.నాగేశ్వరరావు	83310 56664
ఏఓ	ఎస్.లక్ష్మీ లావణ్య	83310 56557
ఏపీఓ	జి.అరుణకుమారి	70933 23644
ఏపీఎం	ఎం.ధనరాజు	98499 01696
హౌసింగ్ జేఈ	డి.శ్రీనివాసు	70939 30448
ఎంఈఓ–1	బి.అప్పాజీ	80748 05733
ఎంఈఓ–2	కెవి.సుబ్బరాజు	96189 37973
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	పి.పద్మ	91001 21135
సీడీపీఓ. కొత్తపేట	పి.శారద	94408 14683
చొప్పెల్ల పీహెచ్‌సీ	డి.సువర్చలాదేవి	70136 40523
పెదపళ్ల పీహెచ్‌సీ	పి.భవానీశంకర్	88017 87816
ఇరిగేషన్ జేఈ	కృష్ణ త్రిమూర్తులు	83286 29109
పశుసంవర్ధకశాఖ ఏడీ	ఎల్.అనిత	95503 93727
పశువైద్యాధికారి	జి.భానుప్రసాద్	95332 87404
ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్	డి.నాగేశ్వరరావు	97012 87828
ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	పి.రాంబాబు	91609 88844
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	టిఎస్‌వి.నాగలక్ష్మి	63099 39852
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	వై.అరుంధతి	89778 30575
ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి	పి.గోపిరామ్	93467 87187
మండల ఇంజనీరింగ్ జేఈ	డి.వీరభద్రరావు	83175 43987
ఆర్అండ్‌బీ జేఈ (ఇన్‌చార్జి)	సూర్యనారాయణ	94408 18285